క్లుప్తంగా

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న శక్తి సంస్థ అధ్యక్షురాలు పైడి రజని

డాబాగార్డెన్స్: నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని ఆర్. గాయత్రికి శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ) సంస్థ తరఫున రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ అధ్యక్షురాలు పైడి రజని అందజేశారు. శక్తి సేవా సంస్థ వ్యవస్థాపక సభ్యురాలు, పైడి రజని తల్లి పేడాడ ఉమాదేవి జయంతిని పురస్కరించుకుని ఈ సాయం అందజేసినట్టు రజని తెలిపారు.

ఆలోచింపజేసిన దేవిశ్రీ గీతం



ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన వారెందరో.. పోరు బాటలో అసువులు బాసిన అమరవీరులెందరో.. వారి త్యాగం ఏమాయెను పాలకులారా.. ఆ త్యాగాలను తుంగలో తొక్కిందే మీరు.. అచ్చేదిన్ అంటే ఏమో అనుకున్నాం.. సచ్చే దినము వచ్చిందని తెలుసుకోలేకున్నాం.. మోదీ పాలనలో కేడీల రాజ్యమా.. అమ్మేటందుకు వాళ్లెవరు.. కొనేటందుకు వీళ్లెవరు? ఎవడబ్బ సొమ్మని విక్రవీగుతుండ్రు.. స్టీల్‌ప్లాంట్‌కి గనులిచ్చి విశాఖ ఉక్కును కాపాడాలి.. మనమంతా చేయిచేయి కలిపి నడవాలి' అంటూ ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తనదైన శైలిలో ఆలపించి అందర్నీ ఆలోచింపజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో రోగి సూర్యకాంతానికి పింఛన్ అందజేస్తున్న నాగేశ్వరరావు

మహారాణిపేట: రామ్‌నగర్ అపోలో ఆస్పత్రి ఐసీయూలో ఉన్న పేషెంట్ కె.సూర్యకాంతానికి మంగళవారం జీవీఎంసీ జోన్–4 పరిధిలోని 24వ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ పంకు నాగేశ్వరరావు పింఛన్ అందజేశారు.

అలరించిన సంకీర్తన రామకథా గానం



గీతాలు ఆలపిస్తున్న శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీకి చెందిన విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో అలరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో ఆకట్టుకున్నారు. 'బ్రహ్మమొక్కటే..', 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు..' వంటి భక్తిగీతాలు ఆలపించి అలరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఏయూ క్యాంపస్: రుతువులు మారే సమయంలో ఆరోగ్య పరిరక్షణ పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ మధుమిత కృష్ణన్ అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం, జీర్ణ క్రియను బలపరుచుకోవాలని సూచించారు. నెయ్యి, కూరగాయలు, ఆకుకూరలు, బాదం వంటివి నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, బాదం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇతర పోషకాలతో కూడిన రోజువారీ ఆహార ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధికి దూరం.. సమస్యలకు ఆలవాలం

- నిర్జీవంగా చేపల బజార్లు
- ఇబ్బందుల్లో వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



కోటవీధి చేపల మార్కెట్‌లో చేపలు విక్రయించాల్సిన చోట భవన నిర్మాణ సామగ్రి



అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న కోటవీధి చేపల మార్కెట్

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో గల పలు బజార్లు, చేపల మార్కెట్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. స్పందించే నాథుడు లేకపోవడంతో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి దాపురించింది. స్థానిక కార్పొరేటర్లు ఎలాగూ పట్టించుకోవడం మానేశారు. పది నెలల కిందట ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా తమ గోడు పట్టించుకోవడం లేదంటున్నారు చిరు వ్యాపారులు. ఇక జీవీఎంసీ అధికారులకు తామంటే చిన్న చూపు అని వాపోతున్నారు. నియోజకవర్గ పరిధిలో గొల్లలపాలెం బజార్, దండుబజార్, చెంగల్రావుపేట బజార్, కోటవీధి చేపల మార్కెట్, అల్లిపురం బజార్, రెల్లివీధి శ్రీపోలమాంబ చేపల మార్కెట్ ఇలా పలు మార్కెట్లు.. బజార్లు సమస్యలతో సతమతమవుతున్నాయి.

అసౌకర్యాల నడుమ కోటవీధి బజార్..

జీవీఎంసీ 39వ వార్డు పరిధి కోటవీధిలో గల చేపల మార్కెట్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ బజార్‌కు కోటవీధితో పాటు అంబుసరంగ్‌వీధి, ఫెర్రీరోడ్డు, థామ్సన్‌స్ట్రీట్, చాగంటివారి వీధి తదితర ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. ఈ బజార్ నిర్జీవంగా పడి ఉంది. మత్స్యకారులు ఉండాల్సిన చోట ఇంటి నిర్మాణ సామగ్రి దాచుకున్నారు. మరీ ముఖ్యంగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ చేపలు విక్రయించే మత్స్యకార మహిళలు ఈ మార్కెట్‌ను వీడి వెళ్లిపోయారు. ఇక్కడ సరైన నీటి సౌకర్యం లేదు. చేపలు భద్రపరుచుకునేందుకు పరికరాలు, విద్యుత్ లైట్లు లేవు. ఇలా ఒకటేంటి ఈ బజార్ ఎన్నో సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

సౌకర్యాల లేమితో దండుబజార్..



సమస్యలకు ఆలవాలంగా దండుబజార్ మార్కెట్

జీవీఎంసీ 29వ వార్డు పరిధిలో గల దండుబజార్‌కు దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, రామజోగిపేట, భుజంగరావుపేట, అంగటిదిబ్బ, ఆంథోనీ నగర్, తాడివీధి, సాలిపేటతో పాటు జగదాంబ పరిసర ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. ఈ బజార్ విశాలంగా ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేక చేపలు, కూరగాయల విక్రయదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బజార్ అంతా రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణాల ద్వారానే సాగిపోతుంది. ఫలితంగా ఆదివారం వచ్చిందంటే ట్రాఫిక్ జామ్ అవుతోంది. బజార్‌ను ఆధునికీకరిస్తే కొనుగోలుదారులు నేరుగా బజార్‌లోకి వెళ్లి కొనుగోలు చేయగలరు.

రెల్లివీధి మార్కెట్..



అసౌకర్యాల నడుమ రెల్లివీధి చేపల మార్కెట్

జీవీఎంసీ 37వ వార్డు పరిధి రెల్లివీధి పోలమాంబ చేపల మార్కెట్‌కు రెల్లివీధి, కోడిపందాల వీధి, జబ్బర్‌తోట, పెయిందొరపేట తదితర ప్రాంతాల ప్రజలు చేపలు, రొయ్యలు, పీతల వంటి మత్స్యసంపద కొనుగోలుకు వస్తుంటారు. ఈ చేపల మార్కెట్లో మౌలిక సదుపాయాలు లేక విక్రయదారులు.. కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. చేపల మార్కెట్‌కు షెడ్డు ఉన్నప్పటికీ ఏ పాటి వర్షం కురిసినా చేపల బజారంతా వరదమయమే. ఇదిలా ఉండగా ఇక్కడి గచ్చును టైల్స్‌తో అద్దడంతో చిన్నపాటి వర్షానికే మార్కెట్ అంతా బురదమయమవుతోంది. గత ఏడాది ఓ మహిళ చేపల కొనుగోలుకు వచ్చి బురదగా ఉన్న గచ్చుపై జారిపడింది. తలకు తీవ్రగాయమైన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని అక్కడి జాలర్లు.. చేపల విక్రయదారులు 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోలుదారులు చేపలు కొనుగోలు చేయాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో లోపలికి వెళ్లలేక బయటే కొనుగోలు చేసి వెళ్లిపోతున్నారు.

పేరుకే చెంగల్రావుపేట బజార్..



ఉనికిలో లేని చెంగల్రావుపేట బజార్

జీవీఎంసీ 36, 37 వార్డులకు అనుసంధానంగా చెంగల్రావుపేట బజార్ ఉంది. ఇది అతి పురాతన బజార్. కానీ ఇక్కడ బజార్ ఉన్నట్టు ఎక్కడా కనిపించదు. షెడ్డు లేదు. ఎప్పుడో దశాబ్దాల కిందట ఈ ప్రాంతంలో రోడ్డు మీదే చేపలు విక్రయించేవారట. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి చెంగల్రావుపేట బజార్ అని పేరొచ్చింది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో చేపలు విక్రయించడం మానేశారు. అయినా ఈ ప్రాంతాన్ని చెంగల్రావుపేట బజారుగానే పిలుస్తారు.

మార్కెట్ శిథిలావస్థకు చేరింది..

మార్కెట్ షెడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడిపోయాయి. గేట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. ఏపాటి వర్షం కురిసినా మార్కెట్ అంతా బురదమయమవుతోంది. చేపలు కొనుగోలు చేసే వారు ఆ బురదలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. నాయకులు, అధికారులు ఇప్పటికైనా మా బాధలు గమనించి మార్కెట్ అభివృద్ధికి నడుం బిగించాలి.

– కొర్లమ్మ, చేపల విక్రయదారు, రెల్లివీధి చేపల మార్కెట్

మార్కెట్లో దొంగతనాలు..

చేపల మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ గేట్లు రెండూ మూలకు చేరడంతో రాత్రి వేళల్లో దొంగలు విలువైన చేపలు దొంగిలిస్తున్నారు. ఇటీవల సుమారు రూ.15 నుంచి రూ.20 వేల విలువ చేసే చేపలు ఎత్తుకుపోయారు. ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదు. చిన్నపాటి గాలి, వర్షానికే ఇక్కడి చెట్టు కొమ్మలు షెడ్డుపై పడి రేకులు విరిగిపడుతున్నాయి. పలుమార్లు సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా ఫలితం లేదు. చేపల మార్కెట్‌ను శుభ్రపరిచే వారు లేక మేమే శుభ్రం చేసుకుంటున్నాం.

– మసేనమ్మ, చేపల విక్రయదారు, రెల్లివీధి చేపల మార్కెట్

మా గోడు ఎవరు వింటారు?

మా గోడు వినేవారు లేరు. గత కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిలువ నీడ లేని పరిస్థితిలో ఉన్నాం. ఏ పాటి వర్షం వచ్చినా శ్లాబ్‌పై వర్షపు నీరు నిలిచిపోవడంతో శ్లాబ్ నుంచి నీరు కారడమే కాక పెచ్చులూడుతున్నాయి. మార్కెట్‌కు ఉన్న గేట్లు మూలకు చేరాయి. ఇటీవల చేపల దొంగతనం ఎక్కువైంది. ఈ విషయమై పలు మార్లు రాజకీయ నాయకులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎవరూ స్పందించలేదు.

– సత్యవమ్మ, చేపల విక్రయదారు, కోటవీధి చేపల మార్కెట్

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



లక్ష కుంకుమార్చనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.10 వేలు చెల్లించినచో వారి తరఫున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, 8985515989 నంబర్‌కు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వర్ట్ పనులకు త్వరలో మోక్షం



టౌన్ కొత్త రోడ్డులోని కల్వర్ట్

జగదాంబ: ఎట్టకేలకు వన్‌టౌన్ రహదారి పనులు ప్రారంభం కానున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు త్వరితగతిన రహదారి విస్తరణతో పాటు కాల్వలు, కల్వర్టులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టౌన్ కొత్తరోడ్డు వరకు మాత్రమే పనులు అయ్యాయి. మిగిలినవి ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయి. ముఖ్యంగా టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు పనులు ఆగిపోవడంతో వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. సుమారు సంవత్సర కాలంగా కల్వర్ట్ సమీపంలో ఉన్న వ్యాపారులు దుర్వాసనతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ రూ. 41 లక్షలు విడుదల చేయడంతో పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తొలగిపోతాయని పాతనగర వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీ సమీపంలోని శ్రీశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సులు చదవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా బీటెక్‌లో నేరుగా రెండో సంవత్సరంలో చేరి ఉన్నత విద్యను కొనసాగించుకోవచ్చన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోన్–4 ఆదాయం రూ. 52.60 కోట్లు



జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో రూ. 52 .60 కోట్లు ఆర్జించినట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు మంగళవారం తెలిపారు. గత ఏడాది ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి రూ. 42 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం అది పెరిగిందన్నారు. ఇంటి పన్నుల రూపంలో రూ. 47 కోట్లు, నీటి పన్ను కింద రూ. 3.80 కోట్లు, ఖాళీస్థలాల పన్ను కింద రూ. 1.80 కోట్లు మొత్తం కలిపి రూ. 52 కోట్ల ఆదాయం వచ్చిందని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

పింఛన్ల పంపిణీ

మహారాణిపేట : జీవీఎంసీ 28వ వార్డు పరిధిలోని జేఎస్ఎం కాలనీలో విశాఖ జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అర్హులైన చాలా మందికి పింఛన్లు రావడం లేదంటూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కాలనీలో కాలువలు సరిగా లేవని కలెక్టర్ దృష్టికి స్థానికులు తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) పి.ఎం.సత్యవేణి, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏపీడీ పద్మావతి, ఏఎంవో హెచ్ రాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

సీతమ్మధార: ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మంగళవారం ఎన్ఎంసీహెచ్ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ సూచనల మేరకు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రియదర్శిని, భారతి, భవానీ, విక్టర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మ్యాన్‌హోల్‌పై చెట్టుకొమ్మలు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయం మలుపులో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. రోజూ ఎవరో ఒకరు పడిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. మంగళవారం కూడా ఇద్దరు వాహన చోదకులు పడిపోవడంతో టూటౌన్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మ్యాన్‌హోల్‌పై స్థానికులు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ స్టాపర్‌ను తొలగించి ఆ స్థానంలో చెట్టుకొమ్మలు పెట్టి జాగ్రత్తలు తీసుకున్నారు. పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహన చోదకులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న భవన నిర్మాణ కార్మికులు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

డాబాగార్డెన్స్: ఎండలు మండిపోతున్నాయి. పాదచారులు.. కార్మికులు.. కర్షకులు దాహార్తికి అల్లాడుతున్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఎక్కడా అటువంటి చర్యలు కానరావడం లేదు. ప్రభుత్వం విస్మరించినా.. మాకూ మానవత్వం ఉందంటూ భవన నిర్మాణ కార్మికులు సింగ్ హోటల్ జంక్షన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు మంచి నీటికి అల్లాడుతున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని భవన నిర్మాణ సంఘం నాయకుడు సిమ్ముునాయుడు ఆర్థిక సాయంతో మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంఘం మహిళా నాయకురాలు లక్ష్మి చేతుల మీదుగా పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకుడు కె. నర్సింగరావు మాట్లాడుతూ వేసవి తాపానికి దాహం తీర్చిన వాడే నిజమైన మానవతా వాదని భవన నిర్మాణ కార్మికులు నిరూపించుకున్నారని కొనియాడారు. ఈ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవత్వం చాటుకోవాలని కోరారు.

ఘనంగా ఉత్కల్ దివస్ వేడుకలు



ఉత్కల్ దివస్‌లో పాల్గొన్న ప్రముఖులు



పాటలు పాడుతున్న కళాకారులు

బీచ్ రోడ్డు: ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని ప్రాంగణంలో వేడుకలు జరిపారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ఒడిశా రాష్ట్రం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిశా వాసులంతా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్ ఫెస్టివల్‌ను కేంద్ర ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. ఒడిశా ప్రత్యేక వంటకాలైన కాకరా, చెనాపోడా, దహిబారా, గుగుని, మాల్పువా వంటివి ప్రదర్శించారు. సంప్రదాయ చేనేత ఉత్పత్తులను తిలకించి ప్రశంసించారు. ఒడిశా ప్రాంత ప్రముఖులైన మధుసూదన్ దాస్, గోపబంధు దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్ వంటి వ్యక్తులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. తూర్పు కోస్తా రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఎలాంటి త్యాగాలకైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరానికి నేటితో 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూ దానిని పూర్తిగా ప్రైవేటీకరించేందుకు అడుగులు వేస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అడుగుతుంటే ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని పెద్ద ఎత్తున సంబరాలు చేసిందన్నారు. ఈ ప్యాకేజీ నుంచి ప్లాంట్ ఉత్పత్తి, ముడి సరుకు, కార్మికుల జీతభత్యాలకు ఒక్క రూపాయి ఉపయోగించలేదన్నారు. ఈ సొమ్మును పాత అప్పులు, బ్యాంకు అప్పులు తీర్చేందుకు, జీఎస్టీ పేరిట కేంద్రమే వెనక్కి తీసుకుందన్నారు. మిగిలిన ప్యాకేజీ నిధులివ్వాలంటే కాంట్రాక్ట్ కార్మికుల్లో 5,600 మందిని విడతల వారీగా తొలగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను ఏ ఒక్కరిని తొలగించినా సహించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు చెబుతూనే ప్లాంట్‌కు సొంత గనులు అడగకుండా అనకాపల్లి జిల్లాలో నిర్మిస్తున్న మిట్టల్ కంపెనీకి సొంత గనులు కేటాయించాలని అడగడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావు, సీఎఫ్‌టీయూఐ అఖిల భారత అధ్యక్షుడు ఎ. కనకరావు, సురేష్, ఏపీ ఎఫ్‌టీయూ దేవా, వైఎస్ఆర్‌టీయూ నాయకులు ఆర్.అనిల్‌కుమార్, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, శ్రామిక మహిళా కన్వీనర్ పి.మణి, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కమిటీ ప్రతినిధి ఎస్.జ్యోతీశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, ఎన్‌రామారావు తదితరులు పాల్గొన్నారు.